# మానవత

రత్న చంకలో బిందెతో పరిగెత్తుకు వచ్చినట్టుగా ఇంట్లో వచ్చిపడింది.

కూతురు పరిగెత్తుకురావడం, వగర్చడం చూసి, "ఏమిటే, అలా పరిగెత్తుకు వచ్చావు?" అనడిగింది తల్లి, దేవకి.

"రంగరాజు కొడుకు రెడ్డిగారి కొడుకు వెంటబడ్డారమ్మా! చాలా అసభ్యంగా మాట్లాడుతున్నారు. ఆ మాటలు నా నోటితో చెప్పడానికే సిగ్గేస్తుంది" రత్నకి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

"కాస్త వయసున్న ఆడపిల్ల కనిపిస్తే చాలు ఆంబోతుల్లా వెంటపడడమేనా ఈ కొడుకులకు పని. థూ! వీళ్ళకి చెల్లెళ్ళూ, తల్లులూ లేరేమో అడుగుతాను నడిబజారులో వాళ్ళ సిగ్గు తీయకపోతే నా పేరు దేవకి కాదు" దేవకి భగభగమండుతూ వెళ్ళబోయింది.

"వద్దమ్మా! వాళ్ళ జోలికి వెడితే ఇంకా రెచ్చిపోతారు. పగబట్టినట్టుగా అవుతారు. వాళ్ళు ఏం దుర్మార్గం తలపెట్టినా ఇద్దరం ఆడవాళ్ళం. ఏం చేస్తాం చెప్పు?" అంటూ తల్లి రెక్కపుచ్చుకు ఆపింది రత్న.

"మరీ నోరు చచ్చి కూర్చుంటే వాళ్ళ ఆగడాలకు అంతుంటుందా?"

"వాళ్ళు ముందే దుష్టులు. వాళ్ళ జోలికి వెడితే ఏమైనా ఉంటుందా? బలహీనులం బలవంతులను ఎదుర్కొంటే ఏం జరుగుతుందో తెలియదా?"

ఏం జరుగుతుందో తెలుసుకాబట్టి దేవకి నిస్సహాయంగా కూలబడింది.

"ఎంత దయలేనివాడు దేవుడు? ఇరవయ్యేళ్ళకే నొసటి కుంకుమ చెరపడానికి ఆయనకి చేతులెట్లా వచ్చాయో? వయస్సంతా ముందే ఉంది కదా? ఎలా బతుకుతావో!

అసలు నిన్ను మర్యాదగా బతకనిస్తుందా లోకం? పుల్లాకుమీద విరుచుకుపడే కుక్కల్లా తయారయ్యారే ఈ ఊళ్ళో మగవెధవలు. నేనా కాటికి దగ్గర పడ్డాను. నిన్ను కాపాడుకొనే శక్తి నాకు లేదు. నిన్ను నీవు ఎలా కాపాడుకొంటావో?"

తల్లి మాటల్లోని యథార్థం రత్నని కుంగదీయసాగింది.

రత్న తండ్రి ఆ పిల్ల పదోఏటికే పోయాడు. తల్లే తల్లీదండ్రై పెంచి పెద్దజేసి ఆ పిల్ల పద్దెనిమిదో ఏట పెళ్ళి చేసి అత్తవారింటికి పంపించేసింది. రత్న భర్త సైకిల్‌షాపు సిటీలో పెట్టుకొని రెండేళ్ళు కాపురం చేశారో లేదో అతడు ఏక్సిడెంట్‌లో పోయాడు. అత్తవారింట ఎవరూ ఆదరించేవాళ్ళు లేక పుట్టిల్లు చేరుకొంది రత్న.

మగతోడు లేదు; ఎవరు ఏం అఘాయిత్యం తలపెట్టినా ఇదేమిటని అడిగే నాథుడు లేడు. ఇరవయ్యేళ్ళ పడుచు వయసు. దానికి తోడు సౌందర్యరాశి.

తలమీద నీడచెడి పుట్టింటికి చేరిన మరునాటి నుండే ఊళ్ళో కుర్రకారు ఆకలి చూపులు వెంటాడసాగాయి రత్నను. కుర్రకారే కాదు వయసు మళ్ళుతున్న మగ వాళ్ళు కూడాను కనుబొమ్మలు ఎగరేసి ఓ విలాసవంతమైన చూపు విసురుతున్నారు.

పుట్టిల్లు చేరిన ఈ ఏడాదిలో రత్నని పొందాలని పొంచి కూర్చొన్న నక్కలు ఓ పాతికమందైనా ఉంటారు. రంగరాజు కొడుకు ముకుందం, రెడ్డిగారి కొడుకు రంగారెడ్డి మరీ బరితెగించి మీద పడడానికి సిద్ధమౌతున్నారు.

"రేపో, ఎల్లుండో దొరగారు వస్తారని విన్నాను. నా బిడ్డకు ఏదైనా దారి చూపమని ఆయన కాళ్ళమీద పడతాను" అంది దేవకి.

"ఆయనేం చేస్తారమ్మా?" చిరాకుగా అడిగింది రత్న.

"దొరగారు తలుచుకొంటే చేయలేని దేమిటే? ఒక అనాథకు ఆశ్రయం చూపడం ఆయనకొక లెఖ్ఖా?"

ఆ ఊరి దొరగారి పేరు కృష్ణ నాయుడు. పిల్లల చదువులగురించి, ఇతర వ్యాపారాల గురించి ఆయన కాపురం పట్నంలోనే, రెణ్ణెల్లకీ, మూణ్ణెలకీ ఇక్కడ పొలాల్ని చూచుకోడానికి వస్తుంటారు. రెండుమూడు రోజులుండి వెళ్ళిపోతారు.

దేవకి ఆయన దేవిడీలోనే పని చేస్తుంది. దొరగారు ఉన్నా లేకపోయినా బంగళా అంతా శుభ్రంగా ఊడ్చి పెడుతుంది.

✧ ✧ ✧

అన్ని పనులకి తల్లే వెడుతుందిగాని, నీళ్ళు తోడడం ఆమెకు చేతకాదని నీళ్ళకోసం ఊరిబావి దగ్గరికి రత్న వెడుతుంది. మనస్సేం బాగుండక కాస్త ప్రశాంతతైనా చిక్కుతుందని సాయంత్రం ఊరవతల ఉండే శివాలయానికి వెడుతుంది. చదువు సంధ్య లబ్బక జులాయిగా తిరిగే ముకుందం రంగారెడ్డి రత్న ఎక్కడుండేది అంజనంలో చూసినట్టుగా ప్రత్యక్షమౌతారు. వెకిలి మాటలతో వేధించడం మొదలు పెడతారు.

ఆ రోజూ అలాగే వేధిస్తుంటే, జయదేవ్ చూశాడు. ఇదివరలో కూడా ఒకటి రెండుసార్లు చూశాడు వాళ్ళ వేధింపు. అతడు ఆ ఊరి ప్రాథమిక పాఠశాలకు హెడ్మాస్టరు. ఇంకా పెళ్ళవలేదు. పక్క ఊరే అతడిది.

రత్న గర్భగుడి చుట్టు ప్రదక్షిణం చేస్తూంటే ముకుందం, రంగారెడ్డి వెంట వెంటే నడుస్తున్నారు. ఆగి నమస్కారం పెడుతూంటే వాళ్ళూ ఆగి పెడుతున్నారు. కూర్చుంటే కూర్చుంటున్నారు. అక్కడితో ఆగితే సరిపోయేది.

"చేతులు జోడించి నువ్వేం కోరుకొన్నావురా దేవుడిని?"

"చేతులు జోడించి కళ్ళు మూసుకోగానే నా కళ్ళముందు ఏం కనిపించిందో తెలుసా?"

"ఏం కనిపించింది?" చెప్పలేనంత కుతూహలం వ్యక్తం చేశాడు రెడ్డి.

"ఖరీదైన సినిమాల్లో చూస్తామే, హీరో హీరోయిన్‌కి పెళ్ళికాగానే బ్రహ్మాండమైన శోభనం గది సీను అది".

"పడకమీద నువ్వు హీరో, మరి హీరోయినో?"

"ఆల్చిప్పలంత కళ్ళు, అందమైన నాలిక, దొండపండులాంటి పెదవులు, జలపాతంలాంటి జుట్టు, చిత్రకారుడు దిద్దినట్టుగా వంపులు, సొంపులు" రత్నను క్రీగంట చూస్తూ కవిత్వం చదువుతున్నట్టుగా అన్నాడు ముకుందం.

"తెలిసింది తెలిసింది ఆ సుందరి ఎవరో?" రత్నకేసి కన్నుకొట్టాడు రెడ్డి.

అక్కడే స్తంభాన్ని ఆనుకొన్ని పుస్తకం చుదువుకొంటున్న జయదేవ్ ఇదంతా గమనిస్తూనే ఉన్నాడు.

"ఆ అమ్మాయిని అల్లరిపెట్టడంలో మీ ఉద్దేశ్యం ఏమిటి? మీ ఊరి ఆడకూతురు మీకు చెల్లెలు వరుస అవుతుందన్న జ్ఞానం కూడా లేదా మీకు?" జయదేవ్ పుస్తకం మూసి తీవ్రస్వరంతో అడిగాడు.

"మాకు చెల్లెవరుస అయితే పొరుగూరి అబ్బాయివి నీకు మరదలు వరుస అవుతుంది కాబోలు. అందుకేనా నాయనా ఇంత ఉక్రోషం?" వెటకారంగా అన్నాడు ముకుందం.

ఊహించని ఈ విసురుకు రత్న ముఖమే కాదు, జయదేవ్ ముఖం కూడా కందిపోయినట్టుగా అయింది.

"భర్తపోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ ఆడకూతురపట్ల సానుభూతి బదులు అలాంటి క్షుద్రమైన ఆలోచనలు వచ్చాయంటే వాడు పశువుతో సమానం అనాలి" జయదేవ్ గంభీరంగా మారిపోయి కటుస్వరంతో అన్నాడు.

"ఆ భర్త పోస్ట్ భర్తీ చేద్దామనే" రొమ్ము విరుచుకొంటూ అన్నాడు రెడ్డి.

"ఇద్దరూనా?"

"మహాపతివ్రత ద్రౌపదికి అయిదు మంది ఉండగా, అయిదుమంది చాలక, కర్ణుడితో మానసిక వ్యభిచారం చేయగా".

'మీ పురాణ పరిజ్ఞానం తగలడ!' మంటగా అనుకొన్నాడు జయదేవ్. బురదలో రాయివేసి చిట్లించుకొన్నట్టుగా అయింది. ఇంకా మాట్లాడితే ఇంకా చిట్లుతుందని టక్కున నోరు మూసుకొని పుస్తకం తెరిచాడు.

"తోక ముడిచాడు పంతులు" కోరస్‌గా ఎగతాళి చేశారు ముకుందం, రెడ్డి.

'భగవంతుడా! నీ దగ్గరికి వచ్చినా, ఇక్కడ కూడా కాస్త మనశ్శాంతి చిక్కడం లేదు కదా?' కన్నీరు ఒత్తుకుంటూ నిష్క్రమించింది రత్న.

✧ ✧ ✧

ఊరంచున శివాలయం, శివాలయం పక్కనుండి దొరగారు కృష్ణనాయుడిగారి పొలాలు ప్రారంభమౌతాయి. ఆ పొలాలు చెరువునీటితో సాగుబడి అయినా, చెరువులో నీళ్ళు లేకపోయినా సాగుబడి అయ్యేటట్టుగా పెద్ద బావి కూడా ఉంది.

ఈ బావికే రోజూ బట్టలుతుక్కోవడానికి వస్తుంది దేవకి. రోజూ ఆవిడే వచ్చేది. కానీ, ఆవిడకి జ్వరం వచ్చి పడక వేయడంవల్ల, మూడు రోజులు బట్టలు పేరుకుపోగా, కట్టుకోవడానికి చీరలుండవని ఆ రోజు బట్టలమూట చంకనుంచుకొని రత్న వచ్చింది.

పైరుమీద జీతగాడు క్రిమిసంహారక మందు చల్లుతూంటే ఒడ్డున నిలబడి చూస్తున్నారు దొరగారు.

అదే ఒడ్డుమీద నుండి వెళ్ళాలి రత్న. దొరగారిని చూసి అల్లంత దూరంలో ఆగిపోయినా, అంతదూరం వచ్చి బట్టలుతుక్కోకుండా వెళ్ళిపోయి ఏం చేయాలని, మళ్ళీ ముందుకే సాగింది. ఇద్దరు పట్టేంత ఆ ఒడ్డుమీద దొరగారికి తగలకుండా ఒదిగి ఒదిగి ముందుకు అడుగువేసింది.

రత్న తనని దాటి అంతదూరం వెళ్ళిపోయాక, "ఎవర్రా ఆవిడ?" అనడిగాడు దొరగారు జీతగాడిని.

దొరగారి కంఠంలో వినిపించిన ఆసక్తికి ఒక్కక్షణం ఆశ్చర్యపోయాడు జీతగాడు. ఎందుకంటే దొరగారికి పరస్త్రీని కన్నెత్తి చూడని వాడన్న సత్కీర్తి ఉంది. సాధారణంగా డబ్బుండే వాళ్ళలో కనిపించే విచ్చలవిడితనం ఆయనలో కనిపించదు. రేసులు, తాగుడు, ముండలపట్ల అభిరుచి - ఇవేవీ సోకని మచ్చలేని వ్యక్తిత్వంగా చెప్పుకొంటారు. తాతగారు చనిపోతూ మనుమడి పెళ్ళి చూచిపోవాలన్న కోరిక గాఢంగా వెలిబుచ్చడంతో ఆయనకి పంథొమ్మిదోయేటనే వివాహం జరిగింది. ఇరవయ్యేళ్ళకే బిడ్డ తండ్రి అయ్యాడు. నలభయ్యో పడి వచ్చీరాకముందే తాతయ్యకూడా అయ్యాడు. ఇప్పుడాయన వయసు నలభయ్ అయిదేళ్ళు. ఇద్దరు అల్లుళ్ళు, ఇద్దరు కోడళ్ళూ వచ్చేశారు. రేపో మాపో పెద్దకొడుకు కూతా తాతయ్యని చేయబోతున్నాడు.

కాని, అంతవయసు కనిపించదు. వ్యసనాలేమీ లేకపోవడంవల్ల ఆయన శరీర దారుఢ్యం ఏ మాత్రం సడలలేదు. మంచి ఆరోగ్యవంతమైన తిండివల్ల పాతికేళ్ళనాటి ఆ ఎరుపు, మెరుపు ఆ ముఖంలో ఇప్పటికీ చెక్కుచెదరలేదు. నిగనిగలాడే ఉంగరాల జుట్టుతో, ముప్పయ్యేళ్ళ యువకుడిలా కనిపిస్తాడు.

"మన దేవిడీలో పనిచేసే దేవకి బిడ్డేనండీ, రత్నమాల సిన్నప్పుడు తల్లి ఎంట మన దేవిడికి వస్తాండేది కదా?" అన్నాడు జీతగాడు.

"ఓ! ఆ పిల్లా? మోకాళ్ళ దగ్గరికి లంగా కట్టుకొని, ఎలుకతోకంత జడవేసుకొని, తల్లి కుచ్చిళ్ళలో దూరిపోయి కన్నంలో ఎలుకపిల్లలా తొంగితొంగి చూసేది. ఎంత మారిపోయింది. గుర్తేపట్టలేదసలు" అన్నారు దొరగారు విస్మయంగా.

"ఆ పిల్లకు అంత సక్కదనమూ ఇచ్చి అడవిని గాసిన ఎన్నెల సేసిండు దేవుడు. పెళ్ళిసేసిన రెండేల్లకే మొగుడు పట్నంలో లారీకిందపడి సచ్చిండు. నుదుట కుంకుమ సెదిరి వచ్చి తల్లి పంచన పడ్డది!"

"అయ్యో! పాపం, అలాగా!"

"సక్కనిది, వయసున్నది మగ తోడులేంది ఊళ్ళో వయసు పోరలంతా జింకపిల్లెంటపడ్డ తోడేళ్ళలా అయినరు, దొరా!"

"అలాగా! దేవకి నాతో ఒకమాటా చెప్పలేదేం అంత కష్టం వస్తే?"

"దొరగారు అడగందే ఎవరేం చెప్పగలరు, దొరా!"

అరగంట తరువాత మళ్ళీ అదే దారంట వచ్చిన రత్నను మరింత ఆసక్తిగా చూశారు దొరగారు.

ఇంతవరకు దొరగారి నిలువెత్తు విగ్రహంచూసి ఆడవాళ్ళెందరికో గుండె లయ తప్పితే, ఇప్పుడు జీవితంలో మొదటిసారి దొరగారి గుండె లయ తప్పింది, రత్న సౌందర్యం చూసి.

మరునాడు దేవకి దేవిడీ ఊడ్చడానికి రాగానే దొరగారు అడిగారు! "నీ కూతురు ఎంత పెద్దదైపోయింది నిన్న చూసి నేనసలు గుర్తుపట్టలేదు" అంటూ నిన్న పొలంలో రత్నను చూసిన సంగతి చెప్పారు దొరగారు.

"రోజూ మీ కాళ్ళమీదపడి మా గోడు చెప్పుకొందామనే కాని దొరగారు ఏమనుకొంటారోనని భయపడి ఊరుకొనేదాన్ని. మీ నోటంటే వచ్చింది కాబట్టి నా కెంతో ధైర్యం వచ్చింది దొరా, నాకూ నా బిడ్డకూ ఇంక మీరే దిక్కు. ఇరవయ్యేళ్ళు నిండీ నిండకుండానే నా బిడ్డ జీవితం బుగ్గి అయిపోయింది. ఈ ఊళ్ళో మగవెధవలు దాన్ని గౌరవంగా బకతనిచ్చేటట్టులేదదు. నేను బతికినన్నాళ్ళు బతకబోనుకదా దాన్ని కాపాడుకోవడానికి దాన్ని మీ బిడ్డలా మీ చేతుల్లో పెడుతున్నాను! ఏమైనా చేయండి, దొరా!" దేవకి దొరగారి పాదాలమీదపడి వేడుకొంది.

దొరగారు కాళ్ళు వెనక్కు లాక్కుంటూ అన్నారు. "కాళ్ళమీద ఎందుకు పడతావులే, ఏదో ఒకటి ఆలోచిద్దాం. అధైర్యపడకు" అని హామీ ఇచ్చారు. "ఒకసారి నీ కూతుర్ని తీసుకురా! తన ఆలోచనలేమిటో వింటాను. నాతో పట్నం తీసుకువెడితే చదువుకొంటానంటుందా? ఏదైనా కుట్లూ అవీ నేర్చుకొని, తన బతుకు తను బతుకుతానంటుందా?..."

దొరగారు ఇంత శ్రద్ధగా తన కూతురి భవితవ్యం గురించి మాట్లాడడం చూసి ఉబ్బి తబ్బిబ్బయిపోయింది దేవకి. "ఇప్పుడేం చదువుకొంటుంది, దొరగారూ! మిషనో ఏదో నేర్పించే ఏర్పాటు చేశారంటే తన పొట్ట తను పోసుకొంటుంది. పట్నంలో ఒకరి

ఊసు ఒకరికి పట్టదు కదా, దీని జోలికి వచ్చి అల్లరిపెట్టేవాళ్ళుండరు. పగలూ రాత్రీ నాకు రత్న చింతే అయిపోయింది, దొరగారూ!"

"సరే సరే! ఏదో ఒకటి ఆలోచిద్దాం! రేపు నీ కూతుర్ని తీసుకురా!"

దేవకి ఇంటికివచ్చి ఆ సంగతి చెప్పేసరికి రత్న గుండెలమీద భయంగా చెయ్యుంచుకొంది. "అమ్మో! దొరగారి ఎదుటికే! ఆయన్ని చూస్తే నాకు భయం! ఇహ ఆయనముందుకు వచ్చి ఏం మాట్లాడుతాను?"

"దొరగారు తలుచుకోవాలేగాని, నీ జాతకమే మార్చివేయగలరే!"

"జాతకమే మారుస్తారంటే?"

"మంచి వరుడిని చేసి పెళ్ళిచేసినా చేయగలరు. వారు తలుచుకోవాలేగాని ఏం చేయలేరు?"

రత్న ముఖం పాలిపోయింది. "ఏం మాటలమ్మా అవి? నాకు మళ్ళీ పెళ్ళా?"

"జీవితమంతా ముందరే ఉంది కదా? పొట్టపోసుకోవడం ఒక్కటేనా ప్రధాన సమస్య? నీ జీవితంలో మళ్ళీ వెన్నెల రావాలని ఈ తల్లి కోరుకోవడంలో తప్పేమీ లేదు"

మరునాడు రత్నను బలవంతంగానే తీసికెళ్ళింది దేవకి.

రత్న వెళ్ళిందేగాని తల్లి వెనుక వెనుకే నిలబడసాగింది.

"నా వెనుక వెనుకే నక్కుతావేమే. దురదృష్టపుదానా! ఇలా ముందుకు వచ్చి దొరగారికి నమస్కారం చెయ్యి"

"చిన్నప్పుడూ, ఇప్పుడూ - ఒక్కటే భయం అన్నమాట నన్ను చూస్తే?" దొరగారు చిన్నగా నవ్వారు. "పులిని కాదు, మనిషినే. కొంచెం కళ్ళెత్తిచూడు తెలుస్తుంది".

దొరగారు అంత చనువిచ్చి మాట్లాడుతున్నా, దించిన తల ఎత్తని కూతుర్ని చూస్తే ఒళ్ళు మండినట్టుగా అయింది దేవకికి. ఆ పిల్ల రెక్కపట్టి లాక్కు పోయి దొరగారి పాదాలమీదికి పడదోసింది. "దొరగారి పాదాలు పట్టుకో! వారే నీకొక దారి చూపగల దేవుడు".

"ఛ ఛ! ఏమిటిది దేవకీ? అమ్మాయిని అలా తోశావేం?... లే లే" దొరగారు రత్న భుజాలు పట్టుకు లేవదీశారు. ఒక పెద్దమనిషి వాత్సల్యంతో లేవదీసినట్టుగా

లేదు. ఆ చేతులపట్టు... దాంపత్య జీవితంలో సుపరిచితమైన రత్న గుండెలెందుకో ఝల్లుమన్నట్లుగా అయ్యాయి.

రత్న జంకుగా రెండడుగులు వెనక్కి వేసి నిలబడింది.

"ఊఁ ఇక చెప్పు! నిన్ను మీ అమ్మ నా చేతుల్లో పెట్టేసింది. నీకో దారి ఏర్పరచమంది మీ అమ్మ, నువ్వు కోరుకొనే దారి ఏమిటి?"

"........................."

"మాట్లాడవే మొద్దూ!" తల్లి రత్న నెత్తిమీద మొట్టి మరీ అంది.

"నాకేం తెలియదు మీ రేం చెబితే అది చేస్తాను" అంది రత్న సన్నని స్వరంతో.

"ఏం చెబితే అది చేస్తావు కదూ? మాట తప్పకూడదు మరి!" దొరగారి పెదవులు మందహాసాలు వెదజల్లాయి!

"దేవకీ ఈ క్షణం నుండి రత్న నీ కూతురు కాదు! నా మనిషి! ఇక నిశ్చింతగా ఉండు. నే నిక్కడున్నన్నాళ్ళు ఇక్కడే ఉంచు. నన్ను చూస్తే ఈ భయం పోగొట్టుకోనీ".

దొరగారి మాటను ఎలా అర్థం చేసుకోవాలో తెలియలేదు దేవకికి. పిల్లను ఇక్కడెందుకుంచమంటున్నారు? వయసు పిల్ల, ఛ ఛ! దొరగారి గురించి తను తప్పుగా ఆలోచిస్తుందేమిటి? ఆడవాళ్ళ విషయంలో ఆయన నిప్పులాంటివారని పేరుపొందిన మనిషి.

దొరగారి మాటకు వివరం అడగడానికి జంకిన దేవకి, "అలాగే దొరగారూ!" అని ఇవతలికి వచ్చింది.

"ఇక్కడ నా కేంపని? నేనుండను" అనేసింది రత్న తల్లితో.

"ఉండవంటే ఎలా? దొరగారి మాట జవదాటి బతకగలమా? ఆయన ఉప్పు తిని బతుకుతున్నవాళ్ళం. ఆయన సాయం కోరినవాళ్ళం".

ఉండక తప్పలేదు రత్నకు. దొరగారి మాటను కాదని వెళ్ళిపోతే తల్లికి ఉన్న ఉద్యోగం కూడా ఊడిపోతే తమకిక జీవనాధారమేదీ? అమ్మా, తనూ పూర్తిగా వీధిన బడిపోవాల్సిందే కదా? దొరగారిని సాయం అడిగి లేనిపోని సమస్య తెచ్చిపెట్టిందే అమ్మ.

✧ ✧ ✧

ఆ రాత్రి వంటతడు పాలగ్లాసు రత్న చేతికందించి, "దొరగారికిచ్చిరా!" అని చెప్పాడు.

"ఈ రాత్రివేళ దొరగారి గదిలోకి వెళ్ళనా? నువ్వే తీసికెళ్ళి ఇవ్వు!" అంది రత్న.

"రత్న చేత పాలు పంపించు అన్నారు దొరగారు! మరీ నీ ఇష్టం!"

ఎన్నాళ్ళీ ప్రాణసంకటం? అదేదో ఈ రాత్రి తెగిపోనీ అనుకొని మొండి ధైర్యంతో పాలగ్లాసు పుచ్చుకొని మేడమీది కెళ్ళింది రత్న.

గుమ్మందగ్గర శోభనపు పెళ్ళికూతురిలా నిలబడిన రత్నను చిలిపిగా అడిగారు దొరగారు... "అక్కడే నిలబడితే నాకు పాలెలా వస్తాయి?"

రత్న రెండడుగులు లోపలికి వేసింది. "తండ్రిలాంటివారని... నన్ను మీ కప్పగించింది మా అమ్మ. కంచే చేనుని మేసినట్టుగా..." రత్న కంఠం దుఃఖంతో వణికింది.

"కంచే చేనుని మేసినట్టుగా... తోడేళ్ళ బారినుండి తప్పించుకోడానికి వచ్చి పులివాత పడ్డట్టుగా... అనిపిస్తుందా?" దొరగారు కులాసాగా నవ్వారు. "నా జీవితంలో నా భార్యని తప్ప ఇంకే ఆడదాన్ని ముట్టలేదు, తెలుసా?"

"నా కెలా తెలుసు?"

"ఊళ్ళో చెప్పుకోగా వినలేదా?"

"............................"

"ఇప్పుడు... ఈ వయసులో... నీ మీద మనసు కలిగిందంటే - నువ్వెంత అందమైన దానివో ఊహించు. ఈ అందం నా సొత్తు కావాలి. ఇంకెవరి సొత్తూ కాకూడదనిపించింది. నా సొత్తును నేనెంత అపురూపంగానైనా చూచుకొంటాను. అందలం ఎక్కిస్తాను. ఈ ఊళ్ళో కన్నెత్తి చూసే మగవాడుంటాడా ఇక? నువ్వు నా దానివి అయితే... ఏ లోటూ ఉండదు. ఆలోచించుకో, నా దానివి అవుతావో, ఈ ఊరి తోడేళ్ళ వాతబడతావో! నీ ఇష్టంలేకుండా నిన్ను తాకే మొరటుమనిషిని కాదు".

"దొరగారూ!" ఆ క్షణంలో రత్న మనసులో చెలరేగిన అలజడంతా స్వరంలో ప్రతిధ్వనించింది. "మీరు నాకు అండగా నిలబడితే నేను మీ మనిషినని ప్రపంచానికి చెప్పుకోగలిగితే నన్ను మీకు అర్పించుకొంటాను. నాకు కావలసింది ఇప్పుడు ఒక బలమైన రక్షణ".

"నా మనిషివి అయినాక నిన్ను అన్యాయం చేస్తానా?" దొరగారు లేచి వచ్చి మోహవివశంగా రత్నని చేతుల్లోకి తీసుకొన్నారు.

✧ ✧ ✧

వారం రోజుల తరువాత దొరగారు పట్నం బయల్దేరుతూ, "వారం పది రోజుల్లో తిరిగివస్తాను. తరువాత కార్యక్రమం నిర్ణయిస్తాను... మన మధ్య సంగతి ఇప్పుడే బయటపెట్టొద్దు. గౌరవకుటుంబానికి చెందిన వాడిని. భార్యా పిల్లలున్నవాడిని. చాలా జాగ్రత్తగా వ్యవహరించాల్సిన విషయమిది" అన్నారు, రత్న చుబుకంపట్టి పైకెత్తుతూ.

"నన్ను అన్యాయం చేయరు కదా?" రత్న కళ్ళలో నీళ్ళు చిందాయి.

"ఛ ఛ! ఎంత మాటన్నావు?"

దొరగారు పదిరోజుల తరువాత మళ్ళీ వచ్చారు. వారం రోజులు గడిపారు.

రత్న ఆ బంగాళాలో తిరగడం ఎవరికీ ఏం అనుమానం కలుగలేదు. ఎందుకంటే ఆమె తల్లి ఆ బంగళాలో పనిపాటలు చేసే దాసి. తల్లికి సాయంగా కూతురువచ్చి చేస్తుంది అనుకొన్నారు.

ఇలాగే ఓ ఆరు నెలలు గడిచాయి.

"పట్నం తీసికెళ్ళడానికి పరిస్థితుల్ని సానుకూలం చేస్తున్నాను" అంటూ చెబుతున్నారు దొరగారు. తన భార్యకి హఠాత్తుగా సుస్తీ చేసిందని డాక్టర్లు హార్ట్ స్ట్రోక్ అన్నారని ఇలాంటి సమయంలో అలజడి కలిగించే ఎలాంటి వార్తా ఆవిడ చెవిలో పడకూడదని చెప్పారని ఇలాగే ఏదో ఒకటి చెప్పుకొస్తుండగా రత్నకి నెల తప్పింది.

ఈ వార్త ఒక విధంగా దొరగారికి పిడుగుపాటే అయింది. ఆయన కళ్ళని ఆవరించిన మోహపు తెరలు విడిపోయినట్టుగా అయ్యాయి. ఈ సంగతి తన కుటుంబం దాకా, మిత్రులూ పరిచితుల దాకా వెడితే ఏమైనా ఉందా? తను వాళ్ళ ముందు ఇన్నేళ్ళ జీవితంలో తెచ్చుకొన్న మంచి పేరంతా ఉఫ్‌న గాలిలో కలిసిపోదూ?

ఆయన తన గురించీ, తన పరువు ప్రతిష్ఠల గురించీ ఆలోచించుకొన్నారే గాని, రత్న గురించి కాస్త కూడా ఆలోచించలేదు. సామాన్యంగా డబ్బుండేవాళ్ళకి ఆ సమయంలో వచ్చే ఆలోచనే ఆయనకీ వచ్చింది. అయిదువేల రూపాయలున్న నోట్లకట్ట రత్న ముందుపెట్టి "దీనితో మన సంబంధానికి గుర్తుని తుడిచివెయ్యి" అని ముఖం మరో పక్కకు తిప్పుకొని నిలబడ్డాడు.

రత్న హృదయం తుఫాను వచ్చిన కడలిలా అయింది. "దొరగారూ" అని పిలిచింది వణికిపోతూ. "నన్ను మీ మనిషినని చెప్పుకొంటే చాలు నాకు తాళి అక్కరలేదు, డబ్బు అసలే అక్కరలేదు".

"అది చెప్పుకొంటే ఇహ అన్నీ వచ్చేసినట్టే కదా నీకు!"

డబ్బుతో ఈ లంపటం వదిలేట్టుగా కనిపించలేదు దొరగారికి. ఈ సంబంధం సంగతి దేవకిదాకా వెళ్ళి ఆవిడ గొడవ పెట్టే సూచన కనిపించగానే కారెక్కాడు. గుమాస్తా రంగరాజుని పిలిచి నోట్లకట్ట చేతిలోపెట్టి చెప్పారు. "తల్లీ కూతుళ్ళ నోరు ఎలా మూస్తావో, నీ ఇష్టం. నా పేరు ఎంతమాత్రం బయటికి రాకూడదు".

అలాగే దొరగారు అంటూ రంగరాజు దేవకి ఇంటికి వచ్చాడు. "మర్యాదగా నోరుమూస్తే సరేసరి. లేకపోతే మీ తల్లీ కూతుళ్ళ నోరు ఎలా మూయించాలో నాకు తెలుసు" అన్నాడు రంగరాజు. ఆకారం ప్రవర్తనా రౌడీలకు రౌడీలా ఉంటాడు. అతడిని చూస్తే ఊరంతా హడల్.

దేవకి మాత్రం అగ్నిపర్వతం బద్ధలైనట్టుగా అరిచింది. "గొప్పవాళ్ళు ఏం చేసినా చెల్లుతుందనుకొన్నారేమో. దొరగారి బతుకును బజారు కీడుస్తాను. నా కూతురికి జరిగిన అన్యాయం నలుగురికీ తెలిసేట్టు చెబుతాను. డప్పు వాయించి మరీ చెబుతాను".

"నీ కూతురు ఎవరిచేతో చేయించుకొన్న కడుపుకు దొరగారికి అంటగడతావా? వారేనాడైనా పరాయి ఆడదాన్ని కన్నెత్తి చూశారా? నువ్వు వేసే నిందలకి జడిసి దొరగారు నీ కూతురు మెడలో పుస్తె కట్టేస్తారని ప్లాన్‌వేశావు. ముసలినక్కా! అరిస్తే బజారున పడేది మీ బతుకులే. దొరగారు మచ్చలేని మహారాజు".

"ఆ మచ్చలేని మహారాజే నా కొంప ముంచాడయ్యో! దొరగారు గొప్ప మనసుతో నా బిడ్డకు ఆశ్రయమిస్తాడని ఆయన చేతిలో పెడితే దాని జీవితం నాశనం చేశాడయ్యో!" శోకాలు పెట్టింది దేవకి.

రంగరాజు శక్తివంచన లేకుండా చేయాల్సిన ప్రచారం చేయసాగాడు. కూతురు చెడి ఎవరితో కడుపు తెచ్చుకొంటే అది చాలా తెలివిగా దొరగారికి అంటగట్టి డబ్బు గుంజాలనో, చినదొరసానిని చేయాలనో చూసిందని, ఆ ప్లాన్‌తోనే రత్నను దొరగారు వచ్చినప్పుడు పనివంకతో బంగళాకు పంపించేదని...

ఊరివాళ్ళు ఎటూ తేల్చుకోలేనట్టున్నారు. ఎవరి మాట నమ్మాలో తెలియడం లేదు. దొరగారు మచ్చలేని మహారాజే, రత్న కూడా చిన్న బుద్ధి పిల్లకాదు. పరాయి

మగాళ్ళకేసి కన్నెత్తి చూసేది కాదు. ఆ పిల్ల రూపం, ఆ పిల్ల బుద్ధి చూసి ఒక మామూలు దాసీ ఇంట్లో పుట్టాల్సింది కాదు అనుకొంటారు.

మరి ఇంత ఘోరం ఎలా జరిగింది?

ఊరంతా ఇదే చర్చ! ఎవరిద్దరు కలిసినా ఇదే గుసగుస.

✧ ✧ ✧

రాత్రి పది గంటలవుతూంది.

జయదేవ్ అంతవరకు చదువు కొంటున్నవాడు దీపం ఆర్పేసి పడుకో బోతున్నాడు. తలుపులు మూస్తూంటే ఎవరో కుర్రవాడు పరిగెత్తుకు వచ్చాడు.

"దేవకి మిమ్మల్ని ఓసారి అర్జంటుగా రమ్మందండీ వాళ్ళేదో ఆపదలో ఉన్నారట. అర్జంటుగా జయదేవ్ పంతులుగారిని తీసుకురారా అని నన్ను పంపింది" పరిగెత్తుకు వచ్చినట్టుగా వగరుస్తున్నాడు.

జయదేవ్ ఆందోళనగా, "ఆపదా? ఏమైందిరా?" అనడిగాడు.

"ఏమోనండి! నాకు తెలియదు" వాడు వచ్చినంత స్పీడ్‌గా పరిగెత్తాడు.

జయదేవ్‌కి ఒక్క నిమిషం ఎటూ పాలుపోలేదు. ఎన్నడూ దేవకి ఇంటికి వెళ్ళలేదు. పైగా రత్న సంగతి ఊరంతా పొగలా వ్యాపించింది. ఇంత రాత్రివేళ ఆడవాళ్ళుండే ఇంటికి వెళ్ళడం ఎంతవరకు సమంజసం? ఉదయం వెళ్ళి ఏ సంగతి తెలుసుకొంటే సరిపోదూ?

నిజంగా ఆపదలో ఉన్నారేమో తీరికగా ఉదయం వెడితే జరగాల్సిన అనర్థం జరిగిపోతే?

మొన్న శివాలయంలో కనిపించి, తన గోడంతా చెప్పుకొని, 'నాకు చావొక్కటే మార్గం కనిపిస్తుంది, పంతులుగారూ!' అంటూ విలపించింది రత్న.

పాపం! ఇద్దరూ ఆడవాళ్ళు ఏం ఆపదలో చిక్కుకున్నారో!

మగవాడు తను, ఏ రాత్రి ఎక్కడికి వెడితే తనకొచ్చే నష్టం ఏమిటి?

టార్చీ తీసుకొని తలుపుకు తాళం పెట్టి బయలుదేరాడు జయదేవ్.

ఊరంతా అప్పుడే నిద్రలోకి వొరిగిపోతూంది. దారి పొడువునా ఇళ్ళ తలుపులన్నీ మూసి ఉన్నాయి. దేవకి మాత్రం ఇంటిముందు అరుగుమీద కూర్చొని ఉంది.

జయదేవ్ అంతదూరంలో ఉండగానే గుర్తుపట్టి, "కొంచెం ఇలా రండి పంతులూ! దానికి కొంచెం బుద్ధిచెప్పిపోండి. కంట్లో వత్తులు వేసుకొని కాపలా కూర్చొన్నాను!" అని పిలిచింది.

"ఏం జరిగింది?" అంటూ దేవకితో లోపలికి అడుగుపెట్టాడు జయదేవ్.

"నూతిలో పడతానంటూ తయారైంది. సాయంత్రం నుండి కాపలా ఉన్నాను".

"ఎందుకని?"

"మీకు తెలియకుండా ఉంటుందనుకోను. దొరగారు నా బిడ్డ జీవితంతో ఆడుకొన్నారు బాబూ! ఇప్పుడు తనకేం సంబంధంలేదని వెళ్ళిపోయాడు. అది ఇప్పుడు వట్టి మనిషికూడా కాదు. ఈ అవమానం భరించేకంటే ఈ లోకం నుండి తప్పుకోవడం హాయి అంటుంది. ఈ రోజు పొద్దుటినుండి అదే ప్రయత్నంలో ఉంది. అది పోయాక నాకీ ప్రపంచంలో ఏముంది బాబూ!" అని ఏడవసాగింది.

"చచ్చి సాధించేదేమిటట?"

అదే మాట ఆ మూర్ఖురాలికి కొంచెం చెప్పిపొండి"

"ఎక్కడుంది రత్న?"

"ఆ గదిలో ఉంది. పిలుస్తా నుండండి".

అంతలో తలవాకిలి ఎవరో మూసేశారు అవతలినుండి,

"ఎవర్రా బయటినుండి తలుపులు మూసేది?" దేవకి బిగ్గరగా అరిచింది.

జయదేవ్‌కి అంతా అయోమయం అయిపోయింది.

"రండి ఊరంతా లేచిరండి ఈ తల్లికూతుళ్ళ నాటకాలు ప్రత్యక్షంగా చూద్దురు రండి, దీని బిడ్డకు కడుపు దొరగారు చేశారో, ఎవరు చేశారో ఇప్పుడు చూస్తే మీకే తెలుస్తుంది" పెద్ద గొంతుకతో అరిచి జనాన్ని పోగుచేయసాగాడు రంగరాజు. చుట్టుపక్కల ఇళ్ళ తలుపులన్నీ తెరుచుకొన్నాయి.

నిశ్చేష్టుడై పోయాడు జయదేవ్ "నా దగ్గరికి పిల్లవాడిని పంపించింది నువ్వేనా?" దేవకిని అడిగాడు.

"పిల్లవాడినా? నే నెప్పుడు పంపించాను, బాబూగారూ! మీరే వస్తే దేవుడు పంపించినట్టుగా వచ్చారని సంతోషపడ్డాను. ఇంట్లోకి పిలిచాను".

జరిగిన మోసం తెలిసిపోయింది జయదేవ్‌కి. తెలిసేసరికి జరగాల్సిన అనర్థం జరిగిపోయింది.

జనం బాగా పోగయ్యాక తలుపులు తెరిచాడు రంగరాజు.

ఇంత అవమానం భరించలేనట్టుగా రత్న గదిలోకి పరిగెత్తి భళ్ళున తలుపులు మూసుకొంది.

"లోపల ఏం అఘాయిత్యం తలపెడుతుందో నా కూతురు" శోకాలు పెట్టసాగింది దేవకి.

"రత్నా! తలుపు తియ్ ఈ అపవాదు ఏదో నేను తేల్చేస్తాను అనవసరంగా నువ్వేం అఘాయిత్యం చేయబోకు".

జయదేవ్ ఎంత పిలిచినా తలుపు తీయలేదు రత్న.

దేవకి కూడా ఎంతో బతిమాలి పిలిచింది.

ఇదంతా ఏదో నాటకాన్ని చూస్తూన్నట్లుగా వినోదం చూస్తున్నారు జనం.

జయదేవ్ ఇహ లాభంలేదని తలుపులు బద్ధలుకొట్టటం ప్రారంభించాడు.

రత్న లోపల నిజంగానే ఆత్మహత్యా ప్రయత్నంలో ఉంది.

చీర ఉయ్యాల కాళ్ళకు వేసేసరికి ఆమెకు ముఖమంతా చెమటలు పోశాయి. ఉయ్యాల కాళ్ళకు చీర గట్టిముడివేసి తన మెడకు ఉరి తయారు చేసుకొంది. ఎంత మాత్రం ఆలస్యం చేయకుండా ఉరి మెడకు తగిలించుకొని చప్పున కాళ్ళకింద ఆధారాన్ని తన్నేసింది.

కాని ఆమె అనుకొన్నట్టుగా ఉరికి వేలాడిపోలేదు. గొంతు బిగుసుపోలేదు.

ఆమె నడుం జయదేవ్ చేతుల్లో వాలి ఉంది.

ఎవరో గబగబా స్టూలు ఎక్కి రత్న మెడకున్న చీరముడిని విప్పేశారు.

"నన్నెందుకు బతికిస్తారు? నన్ను చచ్చిపోనివ్వండి. బతికి ఉండి నేనీ నరకం పడలేను" జయదేవ్ చేతుల్లో రత్న పెనుగులాడసాగింది.

"బొందె పోయినా నింద పోదు కదా? చచ్చి సాధించేదేమిటి?"

"ఈ నిందతో ఈ బొందెను భరించడం సాధ్యం కాదు పంతులుగారూ!"

"నువ్వు వెళ్ళిపోతావు, మరి నా సంగతి? ఈ నింద నాకు శాశ్వతమౌతుంది కదా?"

రత్న నిస్సహాయంగా చూసింది. "మీ మీదపడ్డ నిందను తొలగించడానికి నేనేం చేయగలను?"

"నిందను నిజం చేసేద్దాం! సరేనా?" ఇంత వరకు సీరియస్‌గా ఉన్న జయదేవ్ ముఖంలో నవ్వు ఉదయించింది. బయటికి వచ్చి నిలబడి అందరికీ చేతులు జోడించాడు. "ఇంత రాత్రివేళ చాలా శ్రమపడి వచ్చారు. ఇక వెళ్లండి. అయితే వెళ్ళేముందు ఒక శుభవార్త వినిపోండి. రత్నను నేను త్వరలోనే వివాహం చేసుకోబోతున్నాను".

తెల్లబోవడం రంగరాజు వంతు అయింది. చూడవచ్చిన ప్రజలకు అయోమయం అయింది.

"రత్న భర్తను పోగొట్టుకొన్న అభాగిని ఈ ఊళ్ళో చాలామంది మగవాళ్ళు ఆమెను పొందాలని చూసిన వాళ్ళే. తన బతుకు కుక్కలు చింపిన విస్తరి అవుతుందేమోనని భయపడి ఆమె దొరగారిని ఆశ్రయించింది. అర్పించుకొంది. కాని, దగా చేశారు ఆయన. దొరగారు దొంగలా పారిపోయారు.

"మన ముందే అన్యాయమైన అభాగిని రత్న, ఆమెకు న్యాయం జరుగవద్దా? దొరగారిని తీసుకు వచ్చి తప్పు ఒప్పించడంవల్ల జరుగదు న్యాయం. ఏ అండ కోరుకొని ఆమె దగాపడిందో ఆ అండ ఆమె కివ్వడంవల్లే ఆమెకు న్యాయం జరుగుతుంది. ఆ అండ నే నివ్వాలనుకొంటున్నాను. ఆమెను వివాహం చేసుకోవాలనుకొంటున్నాను. కేవలం మానవతా దృక్పథంతో తీసుకొన్న నిర్ణయమిది".

"ఎవరో ఒడిగట్టిన పాపాన్ని మీరెందుకు మోస్తారు బాబూ?" ఎవరో అన్నారు.

"భగవంతుడి సృష్టి. అప్పుడే దానికి పాపం పుణ్యం అంటడం ఏమిటి? పాపపుణ్యాలకు, రాగద్వేషాలకు అతీతమైన మనసుతో తీసుకొన్న నిర్ణయమిది? ఇదే మనసుతో ఆమెతో జీవితం పంచుకోగలను?" మృదు గంభీరమైన స్వరంతో ముగించి లోపలికి వచ్చాడు జయదేవ్.

*యువ మాసపత్రిక, దీపావళి ప్రత్యేక సంచిక, 1985*